క్లుప్తంగా

ఐటీఐలో స్వల్పకాలిక శిక్షణ కోర్సులు

విజయపురం : ఉపాధి అవకాశాలు కలిగిన స్వల్పకాలిక కోర్సులను పన్నూరు సబ్‌స్టేషన్ వద్ద గల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ఐటీఐ కళాశాలలో ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపల్ గణేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన సౌజన్యంతో ఉపాధి అవకాశాలు కలిగిన ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్ సొల్యూషన్స్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కస్టమైజ్డ్ కోర్సు మూడు నెలలకాల పరిధి కలిగిన కోర్సులకు కళాశాలలో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. 18 ఏళ్లు నిండి పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు బయోడేటా అర్హత కలిగిన ధ్రువపత్రాలతో పాటు ఆధార్ కార్డు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో కళాశాల పని వేళలో సంప్రదించాలని కోరారు. వివరాలకు 9441647174, 9885320544, 9494434236, 9912401760, 9441449765 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

బంగారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో బంగారమ్మ

కార్వేటినగరం: కార్వేటినగరం గ్రామదేవతగా విరాజిల్లుతున్న శ్రీబంగారమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పసుపు, చందనం, పాలు, పెరుగు, తేనె, నారికేళ జలాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్‌ను పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళా భక్తులు అమ్మవారికి పొంగళ్లు వండి పిండిదీపాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధ్యక్షుడు ప్రసాద్ భక్తుల తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రంగనాథ మొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్ పిళ్లై, భక్తులు పాల్గొన్నారు.

గుండెపోటుతో యువకుడు మృతి

- అపస్మారక స్థితిలోకి భార్య


శోభన్‌బాబు(ఫైల్)

శ్రీరంగరాజపురం : మండలంలోని రిపుంజ రాజపురం దళితవాడకు చెందిన ఓ యువకుడు మంగళవారం గుండెపోటుతో మరణించాడు. గ్రామానికి చెందిన శోభన్‌బాబు (39)కు ఉదయం హఠాత్తుగా గుండెపోటు వచ్చింది. దీంతో కుటుంబసభ్యులు అతన్ని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా, అక్కడ మృతి చెందాడు. దీంతో శోభన్‌బాబు కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. అతనికి భార్య జ్యోతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త మృతితో జ్యోతి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆమెను వెంటనే బంధువులు ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనతో బంధువులతో పాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబం పెద్దదిక్కు మృతి చెందడంతో కుటుంబం, ఇద్దరు పిల్లలు అనాథలు అయ్యారు.

పెనుమూరు ఎంఈఓగా రుషేంద్రబాబు



పెనుమూరు(కార్వేటినగరం): పెనుమూరు మండల విద్యాశాఖ అధికారిగా రుషేంద్రబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లాలో కేవీపల్లి మండలంలోని ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న ఆయన కడప ఆర్జేడీ ఆదేశాల మేరకు పెనుమూరు ఎంఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యాభ్యాసానికి కృషి చేయాలని, అదేవిధంగా ప్రభుత్వం అందిస్తున్న జగనన్న గోరుముద్దను మెనూ ప్రకారం పిల్లలకు వడ్డించాలన్నారు. నూతన ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన రుషేంద్రబాబును ఉపాధ్యాయ సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు.

పౌష్టికాహారం కిట్లు పంపిణీ


టీబీ కిట్లు పంపిణీ చేస్తున్న డీఐఓ రవిరాజు

నగరి : మండలంలోని బుగ్గ అగ్రహారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు టీబీ పేషెంట్లకు పోషకాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందులతో పాటు మంచి ఆహారం అందిస్తే టీబీ పేషెంట్లు కోలుకుంటారన్న ఉద్దేశంతో ప్రధాన మంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ అనే పథకాన్ని ప్రవేశపెట్టి అందులోకి దాతల ప్రమేయాన్ని తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ రమేష్ బాబు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పూత పూసి.. ఆశలు చిగురించి..

ఏటా జనవరిలో పూత వికసించి పక్వానికి రావడం ఆనవాయితీ. ఈఏడు జనవరి మొదటి వారం నుంచే పూత పూసినా, తరువాత వర్షాలు కురవడంతో పూత మగ్గిపోయి రాలిపోయింది. దీంతో రైతులు దిగాలుపడ్డారు. అయితే జనవరి చివరివారం నుంచి మళ్లీ పూత రావడంతో రైతుల ఆశలు చిగురించాయి. అయితే ఈ దశలో పుత్తూరు డివిజన్‌లోని మామిడి రైతులు ప్రస్తుత పరిస్థితుల్లో తగిన జాగ్రత్తలు పాటించాలని స్థానిక ఉద్యానవన శాఖ అధికారులు తెలియజేస్తున్నారు.

- మామిడిలో సస్యరక్షణ పాటించాలంటున్న ఉద్యానవన అధికారులు
- కలెక్షన్ సెంటర్‌తో రైతులకు మేలు
- దళారులతో పని లేకుండా నేరుగా మార్కెటింగ్


తడుకు గ్రామంలో మామిడి పూతను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారి వెంకటసౌజన్య

పుత్తూరు రూరల్: ప్రస్తుతం పిందెదశలో తోటలు కళకళలాడుతున్నాయి. దీంతో రైతుల కళ్లల్లో ఆనందం కనిపిస్తోంది. అయితే ఈసారి దళారుల దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వం మామిడి కలెక్షన్ సెంటర్ తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా ప్రభుత్వం మామిడి రైతుల గ్రూపునకు 75 శాతం సబ్సిడీని అందిస్తోంది. మామిడి రైతులు గ్రూపుగా ఏర్పడి కలెక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా దళారులను ఆశ్రయించకుండా నేరుగా తమ పంటను అమ్ముకుని లాభాలను ఆర్జించవచ్చు. ఇందుకు ప్రభుత్వం సబ్సిడీ రూపంలో చేయూతను ఇస్తోంది. సుమారు వందమంది రైతులు గ్రూపుగా ఏర్పడి రూ.15 లక్షల వ్యయంతో కలెక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.11.25 లక్షలు అందజేస్తుంది. ఇలా ఏర్పాటు చేసుకున్న కలెక్షన్ సెంటర్‌లో రైతులు పండించిన మామిడిని గ్రేడింగ్ చేసుకుని, మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకోవచ్చు. ఫలితంగా దళారుల వద్దకు వెళ్లే అవసరం లేకుండా నేరుగా అమ్ముకునే అవకాశం ఉంది. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వ మార్కెటింగ్ డిపార్టుమెంట్ వారు కిసాన్ రైలు ద్వారా ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు చేయిస్తుంది. అక్కడి వ్యాపారులను ఇక్కడి కలెక్షన్ సెంటర్ల రైతులతో నేరుగా మాట్లాడించి ధర నిర్ణయించే అవకాశం సైతం ఉంటుంది.

సస్యరక్షణ తప్పనిసరి..



ప్రస్తుతం మామిడి చెట్లలో పిందెలు దిగుతున్నాయి. ఈ సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. బోరాన్ 2 గ్రాముల మందును ఒక లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి. చెట్లకు ట్రిబుల్ నైన్టీన్ కాంప్లెక్స్ ఎరువుతో పాటు మల్టికే ఎరువును సైతం వాడాలి. ఒక్కో చెట్టు పాదిలో 250 గ్రాముల ఎరువును వినియోగించాలి. అలాగే పిందెలపై తామర పురుగు బెడద ఉన్నట్లయితే ఫిప్రోనిల్ 1 ఎంఎల్‌ను ఒక లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి. ఫలితంగా నాణ్యత కలిగిన పంటతో పాటు అధిక దిగుబడిని సాధించవచ్చు.

– వెంకటసౌజన్య, ఉద్యానవన శాఖ అధికారి, పుత్తూరు

అధికారుల సూచనలు పాటిస్తున్నాం



ఉద్యానవనశాఖ అధికారుల పర్యవేక్షణ బాగుంది. వారి సలహాలు, సూచనలు పాటిస్తున్నాం. సస్యరక్షణ నిమిత్తం మామిడి రైతులకు క్రిమిసంహారక మందులు, స్ప్రేయర్లు, ట్రేలు, టార్పాలిన్ పట్టలు, పీవీసీ పైపులను సైతం సబ్సిడీ కింద ఇచ్చి, చిన్న, సన్నకారు రైతులను ప్రోత్సహించాలి. ఇందుకు ఆర్‌బీకేలను కేంద్రంగా చేసుకుని సరఫరా చేయాలి.

– టి.కేశవులు, కేబీఆర్‌పురం మామిడి రైతు సొసైటీ అధ్యక్షుడు, పుత్తూరు

నమ్మకంతో ఉన్నాం



ఈఏడు మామిడి దిగుబడిపై నమ్మకంతో ఉన్నాం. పూత రాలినా, మళ్లీ చిగురించింది. కొంత దిగుబడి తగ్గినా, గత ఏడాది కన్నా మెరుగైన ఫలితం వస్తుందని ఆశిస్తున్నాం. ధరల విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకుని, రైతుకు గిట్టుబాట ధర కల్పించాలి.

– ఎస్.చెంగల్రాజు, రైతు, కేబీఆర్‌పురం, పుత్తూరు మండలం

రైతులు ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి


ఈ–క్రాప్ బుకింగ్ చేస్తున్న వ్యవసాయ సహాయకుడు

పాలసముద్రం: రైతులు సాగు చేసే పంటల వివరాలను ఈ–క్రాప్‌తో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏఓ డిల్లీప్రసాద్ తెలిపారు. మంగళవారం తిరుమలరాజుపురంలో పంట సాగు చేసే రైతులు విధిగా రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకుడి ద్వారా ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. భూమి యజమాని ఎవరైనా సాగు చేస్తున్న రైతు వివరాలు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని చెప్పారు. ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా నంబర్, పట్టాదారు పాసుపుస్తకం, మొబైల్ నంబర్లను చేయాలన్నారు. ఈ–క్రాప్‌లో నమోదైన పంటలకు మాత్రమే పంట బీమా, పంటనష్ట పరిహారం, ప్రభుత్వం అందించే రాయితీలు వర్తిస్తాయన్నారు. చివరకు పండించిన పంటను అమ్ముకోవడానికి కూడా ప్రభుత్వం ఈ–క్రాప్ బుకింగ్ నమోదు తప్పనిసరి అన్నారు. అనంతరం రైతులు సాగు చేసిన వేరుశనగ పంటను వ్యవసాయ సహాయకుడు ఈ–క్రాప్ బుకింగ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

31లోపు పన్నులు చెల్లించాలి


వెంకట్రామిరెడ్డి

నగరి : ఈ నెల 31వ తేదీలోపు మున్సిపల్, నీటి పన్నులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధి పనులు చేపట్టడానికి, పరిపాలనా విభాగం సక్రమంగా నిర్వర్తించడానికి మున్సిపల్ పన్నులు ప్రధానమన్నారు. పన్ను బకాయిలు ఉన్నవారికి ఈ నెల 31 వరకు గడువు ఉంటుందన్నారు. ఆలోపు బకాయిదారులు పన్నులు చెల్లించాలన్నారు. గడువులోపు చెల్లించకుంటే మున్సిపల్ నిబంధనల మేరకు చట్టపరమైన చర్యలు చేపట్టాల్సి ఉంటుందన్నారు.

19న ప్రదోషకాల పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో ఈనెల 19న ఆదివారం ప్రదోషకాల పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. శివుడికి, నందీశ్వరుడికి ఏకకాలంలో అభిషేక పూజలు చేస్తున్నట్లు చెప్పారు. ఆరోజు పూజలు చేయాలనుకున్న వారు ముందుగా పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

నులి పురుగులను నివారిద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న డీఐఓ రవిరాజు

నగరి : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా మండలంలోని బుగ్గ అగ్రహారం, సత్రవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం నులిపురుగుల మందుల పంపిణీ కార్యక్రమాన్ని డీఐఓ డాక్టర్ రవిరాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బుగ్గ అగ్రహారంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలను అందించాలన్నారు. ఈనెల 18వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలలో పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ రమేష్‌కుమార్, ఎంపీహెచ్‌ఈఓలు, ఎంపీహెచ్‌ఎస్, హెల్త్ అసిస్టెంట్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు. అలాగే పిల్లల్లో అనీమియా రాకుండా ఉండడానికే నులిపురుగుల మందులు అందిస్తున్నట్లు ఎంఈఓ శ్రీదేవి అన్నారు. బుగ్గఅగ్రహారం, కృష్ణాపురం పాఠశాలల్లో నిర్వహించిన నులిపురుగుల నివారణ మందుల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని విద్యార్థులకు మందులను అందించారు. ఏఎన్‌ఎం ప్రమీల, ఆశావర్కర్లు పవిత్ర, దేవి, మహిళా పోలీస్ సునీత పాల్గొన్నారు.

వడమాలపేటలో..

వడమాలపేట : విద్యార్థులు ఆరోగ్యం కాపాడుకోవాలని ఆయుర్వేద డాక్టర్ యామిని కోరారు. మంగళవారం సీతారామపురం జెడ్పీ పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ సంధ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : స్థానిక వెంగళరాజుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వైద్యాధికారి మోహన్‌కృష్ణ నులిపురుగులు మాత్రలు అందించి, ఆరోగ్యసలహాలు ఇచ్చారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: స్థానిక ఆరోగ్య కేంద్రంలోని సిబ్బందితో మండల వైద్యాధికారి పల్లవి విద్యార్థుల్లో నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీపై సమావేశం నిర్వహించారు. మండల విద్యాధికారి అరుణాచలం ఆధ్వర్యంలో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

పుత్తూరు రూరల్: విద్యార్థుల్లో ఆరోగ్య పరిస్థితి మెరుగు పరచడం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని అధ్యాపకులు డాక్టర్ శాంసన్‌రాజు తెలిపారు. మంగళవారం స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో రక్తహీనత నివారించడానికే ఆల్బెండజోల్ మాత్రలను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయని చెప్పారు. ఇంటి పరిసరాల్లో పారిశుద్ధ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రధానంగా ప్రతిరోజూ కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. ఫలితంగా నులిపురుగుల బారిన పడకుండా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కోటీశ్వరయ్య, అధ్యాపకులు, ఎన్‌సీసీ అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: విద్యార్థుల్లో నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని వైద్యాధికారి ప్రవీణ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండలవ్యాప్తంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు తినిపించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలతో ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవన్నారు. పిల్లల ఆరోగ్యం పట్ల ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైనా తమకు చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ, డీడీఓ కుమార్, సీహెచ్‌ఓ వెంకటరమణయ్య, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం

గంగాధరనెల్లూరు: నులిపురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని పాత వెంకటాపురం పాఠశాలలో మంగళవారం నులిపురుగుల జాతీయ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అపరిశుభ్రంగా ఉండడంతో నులిపురుగులు కడుపులో ఉండి రక్తహీనతకు దారి తీస్తుందన్నారు. దీంతో శారీరక ఎదుగుదల, ఆకలి తగ్గిపోయి అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఆరునెలలకు ఓసారి ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులతో మింగించాలని సూచించారు. తద్వారా విద్యార్థుల కడుపులోని ఏలికపాములు, నులిపురుగులు, కొంకిపురుగులు, బద్దెపురుగులు, పిన్‌వామ్‌ను నివారించవచ్చన్నారు. భోజనానికి ముందు తరువాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. ఆరుబయట మల విసర్జన చేయరాదని సూచించారు. హెచ్‌ఎం నాగరాజునాయుడు పాల్గొన్నారు.


విద్యార్థికి నులిపురుగుల మందులు వేస్తున్న ఎంఈఓ శ్రీదేవి


మాట్లాడుతున్న అధ్యాపకుడు డాక్టర్ శాంసన్‌రాజు


నింద్రలో ..

నింద్రలో..

నింద్ర: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా నింద్ర జిల్లా ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించినట్లు స్థానిక వైద్యాధికారి కల్యాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం వల్ల పూర్తిగా నులి పురుగులను నివారించవచ్చన్నారు. మండలంలో మొత్తం 3111 మంది విద్యార్థులు ఉండగా మంగళవారం రోజే 3017 మందికి మాత్రలను అందించామన్నారు. వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.


వెదురుకుప్పం: నల్లవెంగనపల్లెలో ఆల్బెండజోల్ మాత్రలు తినిపిస్తున్న అధికారులు


విద్యార్థులతో నులిపురుగుల మాత్రలను మింగిస్తున్న రాజేంద్రప్రసాద్

నిఘా నీడలో ఇంటర్ పరీక్షల నిర్వహణ


ఇంటర్ పరీక్షల కోసం ఏర్పాటు చేసిన డెస్కులు


సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కార్వేటినగరం: ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని ఆర్కేఎస్సార్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాలసుబ్రమణ్యం రాజు తెలిపారు. మంగళవారం ఆర్కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి ఇంటర్మీడియట్ బోర్డు ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. అందులో భాగంగా పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎక్కడా మాస్‌కాపీయింగ్ జరగకుండా ఆదేశాలు వచ్చాయన్నారు. అదేవిధంగా పరీక్షలు రాసే విద్యార్థుల సౌకర్యార్థం తాగునీరు, విద్యుత్ దీపాలు, అలాగే మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేశామని తెలిపారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండలకేంద్రంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి జరిగే ఇంటర్ పబ్లిక్ పరీక్షకు ఏర్పాటు పూర్తి చేశామని ప్రిన్సిపల్ వినాయకం తెలిపారు. మొదటి సంవత్సరం 95 మంది, ద్వితీయ సంవత్సరం 86 విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల్లోగా విద్యార్థులు కేంద్రానికి హాల్ టికెటుతో హాజరు కావాలని, 9 గంటలకు పైన వస్తే విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించమని ప్రిన్సిపల్ తెలిపారు.


పరీక్ష కేంద్రంలో డెస్కులపై హాల్ టికెట్లు నంబర్లు వేస్తున్న అధ్యాపకులు

క్రమశిక్షణతో చదివితే రాణించగలరు


పరీక్ష రాస్తున్న విద్యార్థులను పరిశీలిస్తున్న ఎంఈఓ విజయకుమార్

కార్వేటినగరం: విద్యార్థులకు విద్యాభ్యాసంలో పోటీతత్వం పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ ఎం.విజయకుమార్ అన్నారు. మంగళవారం ఆయన డైట్ ఆవరణలోని ఆదర్శ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న నిర్మాణాత్మక మూల్యాంకనం–4 పరీక్షలను ఆకస్మికంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఫార్మేటివ్ పరీక్షల్లో విద్యార్థులు తమ సామర్థ్యాలను నిరూపించుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యసించే విద్యార్థులు పోటీ పరీక్షల్లో సత్తా చాటుకోగలరని గుర్తు చేశారు. అలాగే విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మోడల్ స్కూల్ హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజగోపాల రాజు మృతి తీరనిలోటు


నివాళులర్పిస్తున్న కుమారస్వామిరెడ్డి

పుత్తూరు రూరల్: పుత్తూరు తదితర ప్రాంత అయ్యప్ప స్వామి భక్తులకు గురుస్వామి రాజగోపాలరాజు మృతి తీరని లోటని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత కుమారస్వామిరెడ్డి తెలిపారు. రాజగోపాలరాజు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న కుమారస్వామిరెడ్డి మంగళవారం కేబీఆర్‌పురం గ్రామానికి వెళ్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ఏపీ ట్రాన్స్‌కో ఏఈగా రాజగోపాలరాజు ప్రజలకు సేవలు అందించారని గుర్తు చేశారు. అలాగే ఆయన కొన్ని దశాబ్దాల పాటు పుత్తూరు అయ్యప్పస్వామి ఆలయంలో గురుస్వామిగా బాధ్యతలు నిర్వహించడం విశేషమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నాలోకనాథం, చిట్టిబాబు, జనార్దన్ యాదవ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం వద్దని ఆందోళన



తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

గంగాధరనెల్లూరు: మండలంలోని ఠాణా చెక్‌పోస్టు వద్ద మద్యం దుకాణం వద్ద ఎన్టీఆర్ కాలనీలో నివాసం ఉంటున్న మహిళలు మంగళవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో మద్యం దుకాణం ఉండడం వల్ల తాగుబోతుల ఆగడాలు మితిమీరుతున్నాయని వాపోయారు. రాత్రివేళ బయటకు రావాలంటేనే భయంగా ఉందన్నారు. మద్యం దుకాణాన్ని మార్పు చేయాలని తహసీల్దారు ఇన్బనాథన్‌కు వినతిపత్రం అందించారు.

బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

తిరుపతి కల్చరల్: తిరుపతిలోని శ్రీకోదండరామాలయంలో ఈనెల 20 నుంచి 28వ తేదీ వరకు జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను అధికారులు సమష్టిగా కృషిచేసి విజయవంతం చేయాలని టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 20న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈనెల 22న ఉగాది అస్థానం, 24న గరుడ సేవ, 25న హనుమంత వాహన సేవ జరుగుతాయని వివరించారు. అదేవిధంగా ఈనెల 31న శ్రీసీతారాముల కల్యాణం, 30 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు శ్రీరామనవమి ఉత్సవాలు, ఏప్రిల్ 3 నుంచి 5వ తేదీ వరకు స్వామి వారి తెప్పోత్సవాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ మేరకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

17న మూలవిరాట్ తొలగింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయమైన శ్రీప్రసన్న వరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణ పనుల్లో భాగంగా ఈనెల 17న మూలవిరాట్‌ను తొలగించనున్నట్లు పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన వరదరాజస్వామి ఆలయాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వరదరాజస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. మరింత వేగం పెంచాలన్నారు. శుక్రవారం శ్రీప్రసన్న వరదరాజస్వామి విగ్రహాన్ని భద్రపరచనున్నట్లు తెలిపారు. ఆలయ అధికారులు శ్రీనివాసులు, కిషోర్‌కుమార్, సూర్యప్రసాద్, అర్చకులు శ్రీనివాసశర్మ, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.